

# 1

జార్జిటౌన్,
10-1-55

ప్రియమైన కల్యాణికి,

అనేక ఆశీర్వాదాలు. మీ ఊళ్ళో పోస్టాఫీసుగాని మూసేశారేవిటి? అయినా అటువైపు విషయాల గాలికూడా ఇటు వీచడంలేదు

మా ఇంటి ఆనవాయితీ ప్రకారం నీవు కూడా తొలి కాన్పుతో ఒక ముద్దుల మనవరాల్ని ప్రసాదిస్తావని మా అమ్మ ఎంత సంబరపడిందనీ. పైగా రోజీ అష్టోత్తరాలూ, లలితా సహస్రనామాలూ వెదకి వెదకి – "యోగీశ్వరి అని పేరుపెట్టమని రాయరా... దేవిపేరూ అదీ శుభంగా వుంటుంది" అన్నది మా అమ్మ. నీవేమిట్రా అంటే కేవలం 'అత్త చెప్పడమూ – నేను వినడమూనా?' అన్నట్టు ఇద్దరు మొగవెధవాయిలని కని కూచున్నావు. పైపెచ్చు వాళ్ళిద్దరికీ ప్రభాకరం, దివాకరం, అని పేర్లు కూడా పెట్టేసుకున్నావు. మా అమ్మ ఉత్సాహం కొంత దెబ్బతింది. తన కోడలు అయినా ఇంటిటి మొండిఘటమని ఆమెకు తెలిసిందికాగు అయినప్పటికీ ఆవిడ అంటోంది కదా "పోతే పోనియ్యరా! ఏదో ఒకటి తల్లీ పిల్లలూ సుఖంగా వున్నారు; అదే పదివేలు. కాని యోగీశ్వరి కని కొన్న సిల్కుబట్ట కల్యాణికి పంపించు. పోనీ అయినా పుట్టించుకుంటుంగి... అమ్మ యికి పురుడొచ్చి రెండు మాసాలు కావస్తున్నదే. ఈపాటికి చంటివెధవల మొహాల్లో పోలికలు తెలుస్తుంటాయి ఎవరి పోలిక లుంటారో? మనింటి పోలికలయితే శుభంరా అబ్బాయ్! నీ పెళ్ళాన్ని అబ్బాయిలిద్దరూ ఎవరి పోలికో కొంత గమనించి వెంటనే రాయమనరా!"

ఆ సిల్కుబట్ట పంపింగమంటావా ఏమిటి? వెంటనే మీ అందరి క్షేమం తెలుపుతూ జవాబు రాయి.

కుర్రకుంకలు ఎవరిపోలికో రాయడం మరచిపోకేం.

నీ ప్రియమైన
లోకనాథం

# 2

ఒందర,
15-1-55

మ-గా-రా-శ్రీ, భర్తగారికి

నమస్కారములు ప్రేమతో రాసిన ఉత్తరం అందింది మా ఊళ్ళో పోస్టాఫీసు మూయలేదుగాని మీ ఊళ్ళో పోస్టలువాళ్ళు కొత్తసావకాశంగా పనిచేస్తున్నట్టున్నారు గనుక నేను మీకు నాలుగో తారీఖున రాసిన ఉత్తరం అందకపోవడానికి కారణం?

పిల్లలపోలికల్ని గురించి మీకు రాద్దామనుకుంటూనే మరచిపోతున్నా. అదీకాకుండా నాకు తోచింగేదో నేనురాస్తే గొప్పలు చెప్పుకుంటున్నా ననుకుంటారేమోనని మా అమ్మమ్మనడిగాను. "నీ మొగుడింటి పోలికలుగాక మరేవిటే వెఱ్ఱిదానా!" అందావిడ. నవ్వుతున్నపుడు ఇద్దరు వెధవలూ అచ్చం మీలాగే వుంటారట ఏడుస్తున్నపుడు మా అమ్మలా వుంటారు. మీ ముద్దుమూళ్ళను ఆట్టేసేపు ఏడవనివ్వడంలేదులెండి! ఎలాగో తంటాలుపడి సముదాయించి సదుకోచేసుకుంటా

ఆ సిల్కుబట్ట గనుక దయతో వెంటనే పంపిస్తే శివప్రకృతి కథ మరచిపోతాను. మా అమ్మమ్మ మనసు ఎంత మెత్తనిదనీ! ఎదురింటోవున్న పద్మ పెళ్ళయిన పదేళ్ళలోనూ ఆరుగురు అమ్మాయిలని కన్నది ఈ ఏడాది ఏడో గాడి సాకునో ఈ సిల్కుబట్ట పద్మకిస్తే ఈసారయినా మొగపిల్లాణ్ణి కనవొచ్చని అమ్మమ్మ ఆశ, ఆశిస్తున్నా కూడా. అంచేత ఆ సిల్కుబట్ట పంపండే

మీ ఆరోగ్యం జాగ్రత్త. వారిమినాళ్లా కాల్చి ఏదో ఒకటి తెప్పించుకుని 'నేనేం చేయను కల్యాణీ' అనకండి ఇహామీద మీరు ఇద్దరు పుత్రులతండ్రి అన్న విషయం గుర్తులో ఉంచుకోవడానికి ప్రయత్నించండి

వెంటనే జవాబు

మీ ప్రియమైన
కల్యాణి.



తైర్థికులు

—ఫోటో: వై. రామకృష్ణారావు, బందరు.

3

జార్జిటౌన్,
20-1-55

.. 'అబ్బాయి లిద్దరూ నాపోలికేనట' అనేసరికి మీ అమ్మ ఎంత ఉబ్బిపోయిందో! ఆవిడ అంత అనురాగంతో వుండగా నీ వెందుకిలా కాలేజి అమ్మాయిగా కస్సుబుస్సుమంటావూ?

మా అమ్మకిపుడు మరో దిగులు పట్టుకుంది "అది సరేగాని, అబ్బాయ్! మన కల్యాణికి చురకయినా పెళ్లి అనుకో. అయినా పసిపిల్లకదా దానికేం తెలుస్తుందిరా? ఇద్దరు మగరాళ్ళు ఒక్కలాగే వున్నారన్నావే. ఏ నామకరణం నాడో ఏ ఉపనయనం నాడో ఒకరి పేరెట్టి మరొకడిని పిలిస్తే మంత్రాల ఫలితమూ, అదీ, ఇదీ, అన్నీ తారుమారయిపోవటూ? అలా పేర్లు మారకుండావుండడానికి ఏం చెయ్యాలిరా?" అని అడుగుతోంది. అవును, మహా గట్టి చిక్కే వచ్చిపడింది ఏం చేయడానికీ నాకూ పాలుపడటంలేదు

నీకేం తెలుసుగాని 'చార్ మినార్'లో వున్న 'ప్లేవర్' 'స్టేట్ ఎక్స్‌ప్రెస్'లో వుండదు అబ్బే! నేను వాటి జోలికి పోవడం లేదులే

మొన్న నీ స్నేహితురాలు వచ్చి వెళ్లింది.

లోకనాథం.

## 4

బందరు,
25-1-55

......మీ అమ్మకు అలాంటి సందేహం కావడం న్యాయమే మరి. ఆ చిక్కు ఎలా విడదీయడమో నాకూ అర్థం కాలేదు.

ఈవిషయం మా అమ్మమ్మతో చెప్పాను. "నీ చేమో పసిదానివాయెను. నీవు అబ్బాయిలని పేర్లెట్టి పిలవడంలో పొరబడతా వేమోనని మీ అత్తయ్య అనుకోదూ మరి? అందుకు నేనో ఉపాయం చెబుతా విను. ఎంతయినా ఆమె పెద్దదీ; నీవామెకు లొంగి వుండాల్సినదానివి. అంచేత కుర్రాళ్లిద్దర్నీ తీసుకుని అత్తగారింటో అడుగు పెట్టగానే 'వీడు ప్రభాకరం వీడు దివాకరం' అని ఆమెకు చూపించు. వెంటనే ఆమె పేర్లని మార్చేస్తుంది. అంతేగా! పోనీ ఆ తర్వాత కూడా పొరబాటు కవకాశం వుందని ఆమె అనుకునేటట్లయితే, చంటిపిల్ల లిద్దరికీ వేర్వేరు రకాల సొమ్ములు చేయించిపెడితే సరిపోతుంది. పెద్దవాడికో రెండు సవరన్ల మామిడి పిందెల హారమూ, చేతులకి రెండు జతల పట్టగాజులూ చేయించి, రెండో వాడికి ఏ రెండో మూడో సవరన్ల స్వస్తిక్ చెయినూ, బొంబాయి ఫేషను గాజులజతా వేయిస్తే సరి—తకీమని వీడు వీడే నని చెప్పొచ్చు. ఆతర్వాత అల్లుడుకూడా పొర బడ్డానికి అవకాశం వుండదనుకో. అయినా బంగారంధరలు మండిపోతున్న ఈ కాలంలో ఇన్నీ చేయించడానికి ఏ నాలుగు వందలో కావలసివస్తుంది. మీ అత్తగారి మెళ్లో ఆరు సవరన్ల చెయినుందిగా! ఇంకా ఆమె కదెందుకూ? చక్కగా దాన్ని కరిగించి కుర్రాళ్లకి వేర్వేరుగా సొమ్ములు చేయించి పెడితే మనవళ్ళిద్దర్నీ వేయికళ్లతో చూస్తూ కాలం గడపవచ్చు ఆవిడ."

ఆవిడ ఇంకో వుపాయం చెప్పింది. "ఎన్ని సొమ్ములు చేయించినా కుర్రాళ్లకి నీవు పెట్టిన పేర్లని మీ అత్తయ్య మార్చితే నాకు మనసులో కాస్త ఇదిగానే వుంటుందిలే అంచేత మరోమాట చెబుతా విను. నీవు మీ అత్తగారితో అబ్బాయిల పేర్లు చెప్పేటపుడు ప్రభాకరం పేరు దివాకరమనీ, దివాకరం పేరు ప్రభాకరమనీ చెప్పు వెంటనే ఆమె పేర్లని మార్చిపెడుతుంది. అందుమూలాన్ని, కుర్రాళ్ళకి నీవు పెట్టిన పేర్లే వుంటాయి; మీ అత్తగారికీ తనే అబ్బాయిలకి పేరుపెట్టానన్న తృప్తి వుంటుంది. అయితే ఇది పరమరహస్యంగా గుండెలో దాచుకోవాలి, తెలుసా? మీ ఇంటాయనక్కూడా తెలియనివ్వకు" అంది.

అయినా మీతో చెప్పకుండా వుండలేను గనుక మీకు రాసేస్తున్నాను. మా అమ్మమ్మ ఉపాయం ఎలావుంది?

శ్యామల ఊరినుండి వచ్చిందా? వాళ్ళమ్మ వాళ్లు సంక్రాంతికి ఏం చీర కొనిచ్చారుటా?

స్టేట్ ఎక్స్‌ప్రెస్ త్రాగుతున్నారా? త్రాగరూ మరి, అడిగేవాళ్లు లేకపోతే. వస్తున్నా. వస్తున్నా

కల్యాణి.

పి. యస్.: కుర్రవెధవ లిద్దరూ బోర్లపడి జోగాడుతున్నారు. పెద్దవాడు మొన్న ముక్కు నేలకికొట్టుకుని ఒక్కటే ఏడుపు. అవధాన్లుగారిని త్వరలో మంచిరోజు చూడమన్నాను.

## 5

జార్జిటౌన్,
2-2-55.

...బాగున్నాయి మీ అమ్మమ్మ ఉపాయాలు. ఆమెని గనక ఆర్థిక శాఖామంత్రిణిగా చేస్తే అమెరికాకు కూడా లోటు బడ్జెటు చూపగలదల్లేవుంది. అయినా ఆమె బుర్రలోకి మన జార్జిటవునులో సందుల్లాటి ఆలోచన లెలావస్తాయో? బహుశా ఆరణాల నవల్సు అనేకం చదివిందేమో? కొంపతీసి తనూ ఒకటి రెండు రాసిందేమో?

మీ ఉపాయాలటుంచి - ప్రభాకరం దివాకరం ప్రభృతుల దహోలని స్వర్ణాభరణాలతో దేదీప్యమానంగా ప్రకాశింప చేయాలన్న మీ అమ్మమ్మ మహదాశయాన్ని గురించి మా అమ్మతో ప్రస్తావించాను. "బాగుంది! వయసొచ్చిన అమ్మాయితే బోసిమెడతో, ఉత్త వాచీచేత్తో వీధిలో వెడు



ఆనందమే జీవితమకరందం..
పొత్తికడుపుకు సంబంధించిన శూల, అతిసారం మొదలైన బాధలతో మీ దైనందిన కార్యక్రమం పాడుచేసుకోవద్దు. ఓమం కర్పూర్ తీసుకుంటే ఈబాధపడ నవసరం లేదు. దానిలోనున్న గుణములు వెంటనే బాధోపశమనం కలిగించి మీకు మంచిఉత్సాహం చేకూర్చును. అనేకమంది స్త్రీలను వేధించుచుఋతుసంబంధమైనజబ్బులుగూడ ఈ ఓమం కర్పూర్ తో మటుమాయం అవుతాయి. ఎంత వయస్సులో వున్నవారైనా ఈఅద్భుతమైన ఔషధం నిరపాయంగా తీసుకోవచ్చును.
హెన్సీస్
ఓమమ్-కర్పూర్
తయారు చేయువారు:
లిటిల్స్ ఓరియంటల్ బామ్ అండ్ ఫార్మస్యూటికల్స్ లిమిటెడ్ మద్రాసు - 1

చూన్న ఈ కాలంలో మగపెళ్ళివారికి కనలేస్తారా? ఎవరయినా వింటే నోటితో నవ్వరు, తెలుసా? మన కల్యాణి తెలివిగలపిల్ల ఎలాగో పేరు సరిగానే గుర్తు పెట్టుకుంటుందిలే. అందుకోసమని నా చెయిన్ చేరిపించడమూ-ఏం అక్కర్లేదు" అంది మాఅమ్మ. సొమ్ములొస్తాయని 'కులికిపోతున్నావుగాబోలు అత్తిపెట్టేసి నాలుగూ పెట్టడం అయిందా? ఇహ ఊరుకో

మరో విషయం నీవు మీ అమ్మగారింటికి వెళ్ళిన ఈ ఐదారుమాసాలనుంచీ చూస్తున్నా నీవు పూర్తిగా వ్యక్తిస్వాతంత్ర్యం కోల్పోతున్నటున్నావ్. నీ భావప్రకటన శక్తి తప్పుతున్నోంది నేను నీకేదిరాసినా నిన్నేమి అడిగినా నీవు అందుకు సమా




రెక్సోనా ప్రొప్రయిటరీ లిమిటెడ్‌వారి తరఫున భారతదేశంలో తయారుచేయబడినది

W.Ro 130-X52 TL

# ★ అమ్మా - అమ్మమ్మా ★

ధాటంగా 'మా అమ్మమ్మ ఇలా అంటోంది, అలా అంటోంది' అని రాస్తున్నావెందుకూ? మీ అమ్మమ్మ ఏం, పత్రికా విలేఖరా? నీకు జవాబులంటూ తోచవూ? అదీగాక ఇక్కడికొచ్చినతర్వాత సర్వవ్యవహారాలూ ఒంటరిగా నీచేతిమీదే నడపాలిగా. పాపము శమించుగాక! నీతోబాటు మీ అమ్మమ్మ కూడా రైలెక్కదుకదా!

ఏమిటి, అవధాన్లుగారు మంచిరోజు చూచి చెప్పారా లేక మీ అమ్మమ్మని అడుగుతో కూచున్నారా? శ్యామలకు ఏంచీర పెట్టాలన్న సమస్యను భేదించడం నీకే చేతనవును.

మీ ఊళ్ళో 'జ్యోతి'లో ఆడుతున్న 'ప్రణయసీమ' చాలా బాగున్నదట.

లోకనాథం.

## 6

బందరు,
6-2-55.

.. మీరు చెప్పింది నిజమే. ఇంటర్ వెలిగించి, ఇద్దరు పిలల తల్లినయిన నాకు ఉత్తరం రాయడం తెలిసి వుండవల్సిందే కానీ నా కలాటి అలవాటు సంపాదించనందుకు మా అమ్మతో మొన్న పోట్లాడాను. వెంటనే ఆమెతరఫున మా అమ్మమ్మ లేచింది తారాజువ్వలా. "అలా చెప్పినంతమాత్రాన వచ్చేవిద్యయితే నీవు జార్జిటౌన్‌లో సంవత్సరన్నర కాలం కాపురం వెలిగించావుగా, అపుడు నేర్చుకుని వుండకూడదూ! నీ మొగుడు ఎమ్మేకదా, నీకు ఉత్తరాలు రాయడం నేర్పించకూడదూ! మీ అత్తగారు చాల లోకానుభవం వున్న మనిషి. ఏవిషయమయినా ఒకటికి నాలుగుసార్లు ఆలోచించి నీభర్తతో చెబితే అతడు తు చ. తప్పకుండా రాస్తాడు. అంత తెలివి నీ కెక్కడేడిసిందీ?" అని నన్ను చీవాట్లు పెట్టింది మా అమ్మమ్మ. నన్నేం చెయ్యమంటారు ప్రభూ?

ఇంకో పది రోజుల తర్వాతగాని మంచి ముహూర్తాలు లేవని అవధానులుగారు చెప్పారు. శ్యామల చీరెవిషయం కనుక్కోలేని మనిషి 'ప్రణయసీమ' బాగున్నదని సిఫార్సు చేయడమెందుకూ? ఆ సినిమా చూడాలని చెప్పరాదూ?

కల్యాణి.

## 7

జార్జిటౌన్
8-2-55

..... అనగా అనగా ఓ అబ్బాయి. ఆ అబ్బాయి బెండకాయకన్నా కాస్త ఎక్కువగా ముదిరినా పెళ్ళంటూ చేసుకోలేదుట. ఓ రోజు ఓ అమ్మాయొచ్చి 'అబ్బాయీ! అబ్బాయీ! పెళ్ళి చేసుకోకూడదా?' అందిట. అందుకా అబ్బాయి 'అమ్మాయీ! అమ్మాయీ! నీవే నన్ను పెళ్ళాడకూడదా?' అన్నాట్ట. అలావుంది నీకథ. నీకు తోచింది నీ వెందుకు రాయకూడదూ అని అడిగితే అందుకు కూడా మీ అమ్మమ్మే జవాబు చెప్పాలి! గ్రహబలం వక్రించడం అన్నది దీనికే పర్యాయపదం గాబోలు.

మీ అమ్మమ్మ బుర్ర సామాన్య మయిందా! రాజాజీని తలదన్నిన తల ఆమె ఉపాయాల దెబ్బకి గోబెల్సు ఉక్కిరిబిక్కిరయేవాడు. పైన నేసెలు కొరుకుంటాయి; లోలోపల తేళ్ళుంటాయి—మీ అమ్మమ్మ వాక్యాల్లో. గురువుగారికి సాష్టాంగ నమస్కారం చేస్తూ పాదాలు కొరికే రకం మీ అమ్మమ్మ!

పుత్రాళ్లు ఎవరి పోలికోనని అడిగితే 'ఏడుస్తున్నపుడు అచ్చం మీఅమ్మ పోలికే' అనడం! కవలపిల్లలుగదా, గురుతెలియక పేర్లు తారుమారవుతాయేమోనంటే వెంటనే ఆరు నవరత్న చెయిన్‌కి ఎసరు పెట్టడం! మీ అమ్మమ్మ నడక్కుండా నీవే జవాబు రాయి అంటే 'మీరు నాకు నేర్పించారు గనక నా?' అని అడగమనడం! పైగా 'మీ అమ్మ చెప్పింది విని మీరు రాస్తున్నారుగా?' అని ఎదురుప్రశ్న వేయడం!

భేష్! బాగుంది! మహా బాగుంది. అయినా ఇంత కల్లోలానికి కారణమయిన మీ ఈఅమ్మమ్మ ఎవరూ? ఒక్క రోజులో ముగిసిన మన పెళ్ళిలో అపూర్వమైన ఈ ఘటాన్ని చూచిన జ్ఞాపకం లేదు. మన సంవత్సరంన్నర మదరాసు కాపురం సమయంలోనూ ఈవిడగారు వేంచేసినట్లు లేదు. అంచేత ఈమెను చూడడం తటస్థపడలేదు. అసలా మాటకొస్తే, నీ ఇటీవలి ఉత్తరాలు చూచిన తర్వాత ఆ మహామహిళను చూడాలనిపించడం లేదు కూడాను. ఆ— అంటే ఈమె కంటికి ఆరు నవరత్న చెయిన్ కన్పడుతున్నదే - ఈవిడ భర్తగా లేక



యినా 'గజెటెడ్ రాంక్'లో వుండేవా కేవిటి? 'గజెటెడ్ రాంక్' కాగు 'ఫారెన్ సర్వీసు'లో వున్నా ఆయన ఈమె మాటకు మగుమాట చెప్పేవాడు కాదని నాకు ఏదో శక్తి చెబుతున్నది. అట్లా వుండవమే మొగాళ్లకి అందం అనబోయేవు సుమా నీవు- మీ అమ్మమ్మ నడక్కుండా నే!

మన అబ్బాయిలు ఎవరిలా జోగాడు తున్నారంటూంది మీ అమ్మమ్మ? మగ్రాళ్ల తెలివితేటలని గురించి ఆమె అంచనా ఏమిటి? ఆ నధవ లిద్దరూ చదవాల్సిన కోర్సులను గురించి సదరు అమ్మమ్మ అభిప్రాయం ఎటు వంటిది?

అక్కడికి రాడానికి నాకు సెలవిప్పించ మని మా ఆఫీసరుగారితో మీ అమ్మమ్మ కొస్త 'రికమెండ్' చేస్తుందేమో కనుక్కో.

లోకనాథం.

## 8

బందరు,
16 2-55

...మా అమ్మమ్మ అంటే మీకింత వేళా కోళమా? ఆమె ఎంతో మంచిది. చాల సాధువు. అతి తెలివిగల వ్యక్తి. అసలు పక్కవారి గుణాలు తూచడం మొగాళ్ల కేం తెలుసూ? అందులోనూ మీకు బొత్తిగా అది శూన్యం. అదిగాక మీ రింతవరకూ ఆమె నొక్కసారికూడా చూడలేదాయెను అంచేత నేను మద్రాసొస్తున్నప్పుడు ఆమెను కూడా తీసుకొస్తున్నా. ఆమెను చూచారంటే మీరు నామాట కాదనరు.

మా అమ్మమ్మ లోగడ మూడుసార్లు కాశీ వెళ్లొచ్చింది. అంచేత రామేశ్వరం చూడా లని వున్నదట మద్రాసుకొచ్చి మనతో నాలుగు మాసాలుండి రామేశ్వరం వచు తుంది. మా అమ్మమ్మకి కూడా గోవింద నామాలూ, మేలుకొలుపులూ అంటే పరమ ఇష్టం. అంచేత ఈమెవుంటే మీ అమ్మకి కాలక్షేపంకూడా అవుతుంది.

ఆమె వుంటే నాకు చేదోడు వాదోడుగా వుంటుంది - పిల్లల్ని, చూచుకోవడానికి. మీ అమ్మకి జవాబు లివ్వడానికి

కల్యాణి.

## 9

(ఎక్స్‌ప్రెస్ డెలివరి)

జార్జిటౌన్,
17-2-55.

.. శరణు శరణు ఏదో తెలిక చేశాను. ఏవి టేవిటో రాశాను. కానీ మీ అమ్మమ్మ రాక వంటి నారాయణాస్త్రానికి తట్టుకో గల ధీమా లేదు కల్యాణీ, లేదు.

మీ అమ్మమ్మను చూడకుండానే నీ వామెనుగురించి చెప్పిందంతా ఒప్పే సుంటాను. ఆమె మహామేధావి సుగుణాల పుంజం. ఆమెలాటి మనిషి లేదు - ఉండ బోదుకూడా.

ఆమె రామేశ్వరం చూడాలంటున్నదా? అబ్బే! రామేశ్వరయాత్ర కిది 'సీజన్' కాదుగా. కావాలంటే బదరీనాథ్ వెళ్ళ రమ్మను. మంచుకిరీటాలు ధరించిన మహో న్నత శృంగరాజాల ప్రశాంత వాతావరణం ఆమెకు నచ్చిపోయి, అంత్యకాలం ఆ భగ వత్ సాన్నిధ్యంలో నే గడిపేయవచ్చన్న సంకల్పం ఆమెకు కలగవచ్చుకూడా.

అదటుంచి నేనుచేసిన చిన్న అపరాధం విన్నవించుకుంటున్నాను దేవీ! సావధాన చిత్తవై అవధరింపుము. మా అమ్మ అంది, మాఅమ్మ అంటున్నది - అంటూ నేను రాసిన దంతా పచ్చి అబద్ధం! పాపం ఆమె ఏదో కృష్ణా రామా అనుకుంటూవుంది, మరొకరి జోలికి రాకుండా.

నీవేం జవాబు రాస్తావోనన్న కుతూహలం కొద్దీ తమాషాగా ఏదేదో కల్పించి రాశాను. అంతేగాని మరోటి కాదు. మనవళ్లు పుట్టా రని మురిసి మూడింతలయి ఎప్పుడెప్పుడు వాళ్ళని చూడామా అని తహతహ లాడి పోతూంది మాఅమ్మ. అంతే కాని, ఇంకో విషయమై పెదవికదిపినపాపాన పోలేదామె నేనూ అంతే! మీ ముగ్గుర్నీ చూచేరోజు కోసం అహర్నిశాలూ ఎదురుచూస్తున్నాను. అంచేత మీఅమ్మమ్మ నటు బదరీనాథ్‌కు బయలు దేరనిచ్చి, నీవూ చిరంజీవులూ ఇటు బయలు దేరండి

ముమ్మల్నందరిని సర్దిపెట్టడం నీ ఒక్క తైకు చేతకానిపని కాదుగా! అంచేత పాపం ముసలావిడను శ్రమ పెట్టకు.

ఈఉత్తరం నిన్ను అందుకునేటోగా నీవు మెయిలునందుకుని వుండవన్న చిన్న ఆశతో వున్నని

లోకనాథం.

## 10

బందరు,
19-2-55.


..... హా.. మీ ఎక్స్‌ప్రెస్ డెలివరీ ఉత్తరం తలచుకుంటే ఇంకా నవ్వాగటం లేదు! ఇంకా నయం, టెలిగ్రాం ఇచ్చారు కారు ..

ఎంతో మంచిదయిన మా అత్తయ్యనంత చెడ్డదానిగా చిత్రించగల కల్పనాశక్తి మీకే వుందనుకున్నారు గామోసు మన కళ్ళు మేదో కాస్త పెమరువేసుకోండి' అమ్మ, మా అమ్మ అంటూ మీరు ఉత్తరాలు రాసి నప్పుడల్లా, అందుకు కించిత్తయినా తీసిపో కుండా 'మా అమ్మమ్మ'ను సృష్టించుకుని మీకు జవాబులు రాశాను నేను అంతేగాని నాకు ఈ భూమ్మీద అమ్మమ్మ అంటూ ఎవ్వరూ లేదు!

ఎల్లుండి బుధవారం మెయిలుకు మా తమ్ముణ్ణి తీసుకువస్తున్నా. తప్పక స్టేషనుకు రండి.

కల్యాణి. ★

హకల్ బెరిపిన్
వెల:రు. 2-0-0 లు.
పోస్టుఖర్చులు అదనము.
ఆంధ్రగ్రంథమాల మద్రాసు.




ఆంధ్రరాష్ట్రమునకు ఏజంట్లు:
శీతారాం జనరల్ స్టోర్స ఏజెన్సీస్, విజయవాడ.